# అర్జీలకు గుణాత్మక పరిష్కారం చూపాలి

- టైంబౌండ్‌లో ఫిర్యాదులు, వినతులు పరిష్కరించాలి
- స్థలాల క్రమబద్ధీకరణ దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం చేయాలి
- ప్రతి దరఖాస్తు దారులకు ఫోన్ చేసి ఎల్ఆర్ఎస్ గురించి వివరంగా చెప్పాలి
- ఈ నెల 31లోగా రుసుం చెల్లిస్తే 25 శాతం రాయితీ
- 60 దరఖాస్తులు స్వీకరణ: కలెక్టర్ రాహుల్ రాజ్


మెదక్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): ప్రజావాణి అర్జీలకు గుణాత్మక పరిష్కారం చూపాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు ఆదేశించారు. టైం బౌండ్‌లో ప్రజా ఫిర్యాదులు, వినతులు పరిష్కరించాలన్నారు. సోమవారం మెదక్ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణిని నిర్వహించారు. అదనపు కలెక్టర్ నగేశ్, డీఆర్వో భుజంగరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావులతో కలిసి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ప్రజావాణికి 60 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తులు పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, వాటిని పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో ఉంచరాదని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి

జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, పంచాయతీ సెక్రెటరీలు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మెదక్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎల్ఆర్ఎస్‌పై పరిశీలించారు. ముందుగా సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల అమలుకు సంబంధిత అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మున్సిపల్ వార్డుల్లో, పంచాయతీల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ఎల్ఆర్ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గతంలో లే అవుట్ చేసి 10 శాతం ప్లాట్లు విక్రయించగా, మిగతా 90 శాతం ప్లాట్లకు మార్చి 31 లోగా ఎల్ఆర్ఎస్ చేసుకుంటే ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు. మిగిలిన వారు కూడా దరఖాస్తు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని, ప్రతి ఒక్క అధికారి బాధ్యతగా తీసుకోవాలన్నారు. అందుకు కావాల్సిన సిబ్బందిని నియమించుకోవాలన్నారు. రుసుం చెల్లించిన దరఖాస్తులను మున్సిపల్ వార్డు సభ్యులు, పంచాయతీ సెక్రెటరీలు పరిశీలించి, వెంటనే చర్యలు తీసుకుంటారని తెలిపారు. కలెక్టరేట్‌లో, మండల కార్యాలయాల్లో, మెదక్, నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్ మున్సిపాలిటీల్లో ఎల్ఆర్ఎస్. సమాచారాన్ని ప్రచారం చేపట్టాలని సూచించారు. పంచాయతీల్లో ఫ్లెక్సీలు ముద్రించి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపాలిటీలో బోర్డ్స్ ఏర్పాటు చేయించాలని, ఫ్లెక్సీ పెట్టాలని, ఎల్ఆర్ఎస్‌పై సభలు, సమావేశాలు పెట్టి విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

మెదక్ అర్బన్, మార్చి 10: అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలని అదనపు ఎస్పీ మహేందర్ అధికారులకు ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరించారు.


ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్

## స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 10: జిల్లా కేంద్రంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో నిరుద్యోగ యువతకు వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో 3 నెలల పాటు శిక్షణ ఇవ్వడానికి 12వ బ్యాచ్ తరగతులు ప్రారంభం కాబోతున్నాయని జిల్లా యువజన, క్రీడాల అధికారి దామోదర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగులు ఈనెల 15వ తేదీలోగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గల వృత్తి నైపుణ్య, శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సులకు 7వ తరగతి, కంప్యూటర్ కోర్సు, సీసీ టీవీ కోర్సు, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ హైస్ వైరింగ్, మొబైల్ సర్వీసింగ్ రిపేర్, మగ్గం వర్కులకు పదో తరగతి ఉతీర్ణులై ఉండాలన్నారు. మూడు నెలల శిక్షణ కాలానికి రూ. రూ.1500 ఫీజు చెల్లించాలన్నారు. శిక్షణ పూర్తయ్యాక ప్రభుత్వ జారీ చేసిన సర్టిఫికెట్ అందజేయడం జరుగుతుందన్నారు. వివరాలకు 7386313741 నంబర్ సంప్రదించాలని సూచించారు.

## డంపింగ్‌యార్డు ఏర్పాటును నిలిపివేయాలి


రిలే నిరాహార దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు

నర్సాపూర్, మార్చి 10: ప్యారానగర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డును తక్షణమే నిలిపివేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నర్సాపూర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారం నాటికి 22వ రోజుకు చేరుకున్నది. ఈ దీక్షలో పదో వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ బుచ్చేశ్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రజలు పాల్గొన్నారు. బుచ్చేశ్‌యాదవ్ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. ప్రజల ఆగ్రహానికి గురికాకముందే ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాజేందర్, రమణారావు, రాంరెడ్డి, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పాపన్నపేట, మార్చి 10: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన ఏడుపాయల ఆలయ సమీపంలోని ఆటవీ ప్రాంతంలో సోమవారం జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా తొగర్‌పల్లికి చెందిన గొరెల్లి వినోద్‌రెడ్డి(33) వంట పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈనెల 7న ఇంట్లో నుంచి బయటకెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. సోమవారం ఏడుపాయల ఆటవీ ప్రాంతంలో వ్యక్తి మృతదేహం ఉందన్న సమాచారం పోలీసులకు అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా మృతి చెందిన వ్యక్తి వినోద్‌రెడ్డిగా గుర్తించారు. మృతదేహం తలపై బలమైన గాయం ఉండడంతో అనుమానాస్పద మృతిగా మృతుడి అన్న విష్ణువర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా దవాఖానకు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## బాలుడిపై కోతి దాడి


గాయాన్ని చూపిస్తున్న బాలుడు

నర్సాపూర్, మార్చి 10: బాలుడిపై కోతి దాడి చేసి గాయపరిచిన ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. బాలుడు తండ్రి నాగులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లికి చెందిన రుత్విక్ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. రోజులాగే సోమవారం పాఠశాలకు వెళ్లాడు. పాఠశాల ఆవరణంలో ఓ కోతి బాలుడుపై దాడి చేసి కాలును కొరికింది. ఈ విషయం తెలుసుకున్న రుత్విక్ తండ్రి నాగులు కుమారుడిని దవాఖాన కు తీసుకెళ్లి చికిత్స చేయించాడు. గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని, ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నామని గ్రామస్తులు వాపోయారు.

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 10: రైతులదరికీ రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రైతులకిచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అరకొరగా కొందరికే రుణమాఫీ, రైతు భరోసా ఇచ్చి మిగిలిన వారికి మొండి చెయ్యి చూపిందన్నారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రసాద్‌గౌడ్ ఆశయాలను కొనసాగించాలి


ప్రసాద్‌గౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శివకుమార్‌గౌడ్

శివ్వంపేట, మార్చి 10: శివ్వంపేట మాజీ సర్పంచ్ స్వర్గీయ జిన్నారం పెద్దగొని ప్రసాద్‌గౌడ్ ఆశయాలను కొనసాగిస్తామని హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం గూడురుకు చెందిన స్వర్గీయ ప్రసాద్‌గౌడ్ 20వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. చండి, తిమ్మాపూర్, గూడురు, పాంబండ గ్రామాల పాఠశాలల్లో పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మీ శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తులు ఉన్నారు.

## రక్త, అవయవ దాన గోడ పత్రిక ఆవిష్కరణ



రామాయంపేట, మార్చి 10: రామాయంపేట లయన్స్ క్లబ్ చార్టర్ సభ్యుడు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి 18వ రక్త అవయవ దాన గోడ పత్రికను సోమవారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని రాగి కన్వెన్సన్‌లోని లయన్స్ క్లబ్ ఇంటర్‌నేష్నల్ గవర్నర్ నగేశ్ పంపాటి ఆధ్వర్యంలో ఈ పత్రికను ఆవిష్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఘట్టమనేని బాబురావు, సునీల్ కుమార్ అమర్‌నాథ్ తదితరులు ఉన్నారు.

## పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి


పెద్దశంకరంపేటలో ఆన్‌లైన్ పరీక్షను పరిశీలిస్తున్న డీఈవో రాధాకిషన్

### జిల్లా విద్యాధికారి రాధాకిషన్

పెద్దశంకరంపేట, మార్చి 10: పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో రాధాకిషన్ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేట బాలుర ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులు ఆన్‌లైన్‌లో రాస్తున్న పరీక్షా విధానాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసన సామర్థ్యాలకు అనుగుణంగా విద్యాబోధన చేయాలన్నారు. మండలంలో మూడు పాఠశాలల్లో రెండో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏంఈవో వెంకటేశం, కాంప్లెక్స్ హెచ్ఎంలు మారుతి, ప్రసన్న, సంగమేశ్వర్, తదితరులున్నారు.

### అల్లాదుర్గంలో..

అల్లాదుర్గం, మార్చి 10: ఈనెల 21 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని డీఈవో రాధాకిషన్ సూచించారు. సోమవారం అల్లాదుర్గంలోని పది పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థుల కోసం తాగు నీరు, విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంఈవో ధనుంజయ, ఉపాధ్యాయుడు రామకృష్ణ ఉన్నారు.

### చిలిపిచెడ్‌లో..

చిలిపిచెడ్, మార్చి 10: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో విఠల్ సూచించారు. సోమవారం చిలిపిచెడ్ జడ్పీహెచ్ఎస్‌లోని పరీక్షా కేంద్రంలో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, మరుగుదొడ్లు సౌకర్యాలను పరిశీలించారు. ఈ కేంద్రంలో 196 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారన్నారు. ఆయనతో కాంప్లెక్స్ హెచ్ఎం రమేశ్ ఉన్నారు.


లింగాపూర్‌లో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

## సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన


నారాయణపూర్ జాతరలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, మార్చి 10: మండలంలోని లింగాపూర్‌లో రూ.18 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణంతో గ్రామస్తులకు రవాణా ఇబ్బందులు తొలిగిపోతాయన్నారు. అనంతరం నారాయణపూర్‌లో నిర్వహిస్తున్న కల్లెట్ల మల్లికార్జున స్వామి జాతరకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను, బీఆర్ఎస్ నాయకులను సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకుడు పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

## 30 శాతం నిధులు కేటాయించాలి


మెదక్ మున్సిపాలిటీ, మార్చి 10: విద్యా రంగంలోని సమస్యల పరిష్కారానికి రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయిచాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, విద్యార్థి నాయకులు నిఖిల్, విష్ణు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం సమస్యలతో సతమతమవుతున్నదన్నారు. సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీ విద్యార్థులకు మెస్ చార్జీలు చెల్లించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న కళాశాలలకు భవనాలు నిర్మించాలన్నారు.

## హనుమాన్ ఆలయానికి రూ.51వేల విరాళం



చిలిపిచెడ్, మార్చి 10: మండలంలోని గౌతాపూర్‌లో ఆంజనేయ స్వామి ధ్వజస్తంభh, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠకు చౌటకూరి గోవర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి బ్రదర్స్ రూ.51 వేల విరాళాన్ని సోమవారం అందజేశారు.

## మహిళా టీచర్‌కు ఘన సన్మానం



రామాయంపేట, మార్చి 10: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని ఝాన్సీలింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలోని మహిళా టీచర్‌ను సోమవారం సన్మానించారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



అల్లాదుర్గం, మార్చి 10: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 25 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు సోమవారం తహసీల్దార్ మల్లయ్య చెక్కులు అందజేశారు. మొత్తం రూ,25,02,900 పంపిణీచేశారు.

# సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 10: సామాజిక సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే వర్ధంతిని సోమవారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొరంకల మల్లేశం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్, వివిధ సంఘాల నాయకులు సత్యం, శాంసన్ తదితరులు ఘనంగా నివాళులర్పించారు.

### నిజాంపేటలో..

నిజాంపేట,మార్చి10: నిజాంపేటలోని నూతన బస్టాప్ వద్ద సావిత్రీబాయి పూలే వర్ధంతిని డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### రామాయంపేటలో..

రామాయంపేట, మార్చి 10: రామాయంపేటలోని సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న పూలే విగ్రహాలకు ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్షురాలు పోచమ్మల అశ్విని పూలమాల వేసి నివాళులర్పించారు.

# కాళ్లకల్‌లో చిన్నారి కిడ్నాప్‌కు యత్నం

మనోహరాబాద్, మార్చి 10: అంగన్‌వాడీ కేంద్రం నుంచి చిన్నారిని కిడ్నాప్ చేసేందుకు గుర్తు తెలియని దుండగుడు యత్నించిన ఘటన మనోహరాబాద్ పోలీస్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించి ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లోని అంగన్‌వాడీ కేంద్రం 2లో విద్యనభ్యసిస్తున్న ఓ చిన్నారిని గుర్తు తెలియని వ్యక్తి అపహరించేందుకు యత్నించాడు. విషయం గమనించిన అంగన్‌వాడీ టీచర్ కేకలు వేయడంతో పాపను అక్కడే వదిలి దుండగుడు పారిపోయాడు. అంగన్‌వాడీ టీచర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## వివాహానికి కంతారెడ్డి ట్రస్ట్ ఆర్థిక సాయం



రామాయంపేట, మార్చి 10: మండలంలోని దంతెపల్లిలో పేద కుటుంబానికి చెందిన డేవిడ్ కూతురు వివాహానికి బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంతారెడ్డి తిరుపతిరెడ్డి ట్రస్టు అధ్వర్యంలో సోమవారం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

# విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేత



### సీఆర్పీల కుటుంబాలకు రూ.12 లక్షల సాయం

చేగుంట, మార్చి 10: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు 12 లక్షల ఆర్థిక సాయాన్ని డీఈవో రాధాకిషన్ సోమవారం అందజేశారు. మక్కరాజిపేట కాంప్లెక్స్‌లో సీఆర్పీలుగా పనిచేస్తున్న జేత్రరాం తండాకు చెందిన రమేశ్, చందాయిపేటకు చెందిన ఎర్ర శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారి పిల్లల పేర సుకున్య సమృద్ధి అకౌంట్‌లో ఫిక్స్ డిపాజిట్ చేశారు.

పాపన్నపేట, మార్చి 10: పాపన్నపేట జడ్పీహెచ్ఎస్‌లో 120 మంది విద్యార్థులకు భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు యాదయ్య ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు.

### స్టీల్ వాటర్ బాటిళ్ల పంపిణీ

రేగోడ్, మార్చి 10: వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అశోక్‌నగర్ వారి సౌజన్యంతో రేగోడ్ కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో బాలికలకు వాటర్ బాటిళ్లు, నోట్ బుక్‌లు, పెన్నుల డీఈవో రాధాకృష్ణ అందజేశారు.

### పరీక్షా ప్యాడ్‌ల పంపిణీ

చిన్నశంకరంపేట, మార్చి 10: ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఎన్నారై చంద్రశేఖర్ పరీక్షా ప్యాడ్లు పంపిణీ చేశారు.



## వెంకన్న సేవలో మాజీ ఎమ్మెల్యే

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 10: తిరుమల వేంకటేశ్వరుడిని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి దంపతులు సోమవారం దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. కుమారుడు పునీత్‌రెడ్డి, కోడలు దీపికారెడ్డి, బంధువులు ఉన్నారు.

## రెండు కేసుల్లో పదేండ్ల జైలు శిక్ష

మెదక్ అర్బన్/చేగుంట, మార్చి 10: అమ్మాయితో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఒక్కొక్క కేసులో ఐదేండ్ల జైలు శిక్ష, రూ.30 వేల జరిమానాను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద విధించినట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. 2018 జనవరిలో చిట్టోజిపల్లికి చెందిన చల్మెడ సురేశ్ ఒక అమ్మాయి చెయ్యి పట్టి, అసభ్యకరంగా ప్రవర్తించడంతో అమ్మాయి తండ్రి చేగుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ నేరాన్ని విచారించి చేగుంట పోలీసులు సదరు వ్యక్తిని కోర్టులో హాజరుపర్చగా, పూర్తి సాక్ష్యాదారాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి ఒక కేసులో ఐదేండ్ల జైలు శిక్ష, రూ.30వేల జరిమానా విధించారు. మరో కేసులోనూ ఐదేండ్ల జైలు శిక్ష, రూ.30వేల జరిమానా విధించారు. నేరస్తుడికి శిక్ష పడేలా వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజ్‌కుమార్, లైజనింగ్ అధికారి, ఇన్వెస్టిగేషన్ అధికారిని ఎస్పీ అభినందించారు.

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు

నర్సాపూర్, మార్చి 10: ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులను పారదర్శకతతో సకాలంలో పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రామకృష్ణారావు ఆధ్యక్షతనలో హౌసింగ్ కార్పొరేషన్ డీఈ సంజీవరెడ్డితో కలిసి అధికారులతో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన, ఎల్ఆర్ఎస్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు ఈ నెల 31వ తేదీవరకు ఫీజు చెల్లించినట్లయితే 25 శాతం రాయితీ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, హౌసింగ్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆత్మ రక్షణకకు మార్షల్ ఆర్ట్స్ అవసరం



నర్సాపూర్, మార్చి 10: ఆత్మ రక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ ప్రతిఒక్కరికీ అవసరమని ప్రిన్సిపాల్ పి.దామోదర్ తెలిపారు. సోమవారం మండలంలోని పెద్దచింతకుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళ సాధికారత విభాగం ఆధ్వర్యంలో మహిళల ఆత్మ రక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ ప్రారంభించారు. మెహెందీ డిజైన్, మార్షల్ ఆర్ట్స్‌పై సర్టిఫికెట్ కోర్సులు ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. మార్షల్ ఆర్ట్స్‌తో మహిళలు ఆత్మస్థైర్యాన్ని, ఆపద సమయంలో ఆత్మ రక్షణకు ఉపయోగపడుతుందని మహిళ సాధికారత విభాగం కన్వీనర్ సమీరా నజరీన్ తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు అనిత, రుక్మిణి, అధ్యాపకులు రమేశ్‌కుమార్, అడెప్ప, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 10: ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్‌కు 5,640 మందికి 5,529 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా ఇంటర్ నోడల్ అధికారి మాధవి తెలిపారు. ఇందులో జనరల్‌లో 5,126 మందికి 5,025 మంది, ఒకేషనల్‌లో 514 మందికి 504 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. మొత్తం 98.03 శాతం హాజరైనట్లు పేర్కొన్నారు.

## యంగ్ ఇండియా సమీకృత గురుకులానికి 200 కోట్లు మంజూరు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 10: మెదక్ నియోజకవర్గంలో నిర్మించే యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే రోహిత్ రావు సోమవారం తెలిపారు. ఈ పాఠశాల 20 నుంచి 25 ఎకరాల స్థలంలో సకల సౌకర్యాలతో నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ ఇలా అన్ని వర్గాలకు చెందిన పేద విద్యార్థులు ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యనభ్యసించడానికి వీలుంటుందని తెలిపారు.

## దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్సీ



పాపన్నపేట, మార్చి 10: ఏడుపాయల వనదుర్గామాతను ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన శ్రీపాల్‌రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఆయన వెంట పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

## హనుమాన్ ఆలయంలో మాధవానంద సరస్వతీ



చిలిపిచెడ్, మార్చి 10: రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి సోమవారం మండలంలోని గౌతాపూర్‌లో ఆంజనేయ స్వామి ధ్వజస్తంభ, నవగ్రహ ఉత్సవాలకు విచ్చేశారు.

## మడేలేశ్వర శీతలాదేవి ఆలయ వార్షికోత్సవం

నిజాంపేట, మార్చి 10: చల్మెడలోని మడేలేశ్వర శీతలాదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని రజక సంఘం సభ్యుల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. సోమవారం హోమం, మడేలేశ్వర శీతలాదేవి కల్యాణం నిర్వహించారు.